# పాలడబ్బా

డా॥ దమ్మన్న శ్రీనివాసబాబు



వాళ్ళమేనోయ్." అన్నాడు రంగారావు.

ఆఫీసు సూపరింటెండెంట్ రావడంతో పిచ్చాపాటి కబుర్లకు తాత్కాలికంగా స్వస్తి చెప్పి టేబుళ్ళమీద దుమ్ముదులుపుకోవడంలో మునిగిపోయారు.

ఫైళ్ళు విప్పుకోవడాలు. డ్రాఫ్ట్స్ వ్రాస్తూ సందేహాలు తీర్చుకోవడానికి, సలహాలు పొందడానికి ఆ టేబుల్ నుంచీ ఈ టేబుల్ దగ్గరికి, సెక్షన్ పెద్ద దగ్గరికీ తిరుగుతూ మధ్య మధ్యలో స్వవిషయాలు మాట్లాడుకుంటూ గడిపేస్తున్నారు

"మూర్తీ! ఓ టెన్‌రుపీస్ సర్దు. జీతం తీసుకోగానే యిచ్చేస్తాను" మెల్లిగా అడిగాడు చంద్రశేఖర్.

"సర్టెన్లీ" అంత మెల్లగానే అన్నాడు మూర్తి. అనడం జేబులోంచి పది రూపాయల కాగితం శేఖర్ జేబులో కుక్కడం జరిగిపోయింది.

"థాంక్యూ మూర్తీ, థాంక్యూ వెరీ మచ్. ఈ నెలలో బంధువుల తాకిడి ఎక్కువయింది. ఎలాగో నెగ్గుకొచ్చినా ఈరోజే మా ఆవిడ మావాడి పాలడబ్బా అయిపోయిందని నోటీసిచ్చింది. అప్పుడప్పుడు దాచిన చిల్లరంతా యిరవై రూపాయలయాయి. పాలడబ్బాకు కనీసం పాతికైనా కావాలి. అందుకే నిన్నడిగాను"

"యిన్ని ఎక్స్‌ప్లనేషన్స్ ఎందుకు శేఖర్! మనలాంటి మధ్యతరగతివాళ్ళకు నెలాఖరు రోజులెలా ఉంటాయో నాకు తెలీందికాదు. అందుకే పెళ్ళి పిల్లల బాదరబందీలో యింకా చిక్కుకోలేదు నేను" నవ్వుతూ అన్నాడు.

"డబ్బయితే కూడింది. మరి పాలడబ్బా కోసం ఎన్ని అగచాట్లు పడాలో!" స్వగతంగా అనుకోబోయాడు. పైకనేశాడు.

"విష్ యూ గుడ్‌లక్" నవ్వుతూ అని తన సీట్లోకి వెళ్ళిపోయాడు మూర్తి.

* * *

లంచ్ అవర్లో క్యాంటీన్లో చంద్రశేఖర్ కోసం వెదికాయి సత్యమూర్తి కళ్ళు. కనిపించలేదు.

"పాలడబ్బా కోసం వేట ప్రారంభించే ఉంటాడు పాపం" అనుకుంటూ కాఫీ సిప్‌చేస్తూ పేపర్ తిరగేస్తున్నాడు.

జేబురుమాలతో ముఖం తుడుచుకుంటూ వచ్చి మూర్తి ప్రక్కనే కూర్చున్నాడు చంద్రశేఖర్.

"ఇంతకు ముందే నీకోసం చూశాను. కాఫీ తాగేశాను" అన్నాడు మూర్తి. బలవంతాన నవ్వు తెచ్చుకుని కాఫీ కార్డ రిచ్చాడు.

"మనాఫీసు చుట్టుప్రక్కల దుకాణా లన్నీ గాలించినా మావాడి బ్రాండ్ పాల డబ్బా కనిపించలేదు" అన్నాడు దిగు లుగా.

"మన దేశంలో భావి పౌరులక్కావా ల్సిన పాలడబ్బాలు దొరకవు గానీ, పౌష్టికాహారాన్ని గురించిన సమాచారం ఎంతయినా దొరుకుతుంది. జాతికి భావి సంపద పిల్లలే నన్న సాహిత్యం పెద్ద వాళ్ళ ప్రసంగాల్లో కుప్పతిప్పలుగా దొరు కుతుంది. నిల్వలు పెరిగి పోతున్నాయని బంగారాన్ని వేలం వేస్తారేగానీ పసిపిల్లల ఒకే ఒక ఆహారమైన పాలడబ్బాలన్నీ మాత్రం అందుబాటులో ఉంచరు గురూ! యిదీ మనదేశం!!" పెదవుల మీద నవ్వులు కనిపించినా ముఖంలో కసి కొట్టొచ్చేట్టు కనిపించేలా అన్నాడు మూర్తి.

"మావాడి బ్రాండ్ దొరక్కపోతే ఆకలితో ఎంతగా ఏడ్చిఏడ్చి సొమ్మ సిల్లి పోతాడో, ఆవిడకేమో పాలులేవు. మరేదైనా వాడితే వాంతులు, విరేచ నాలు, డాక్టరు దగ్గరకి పరుగెత్తడం-ఫీజు, యింజక్షన్లు, మందుల ప్రిస్కిప్షన్లు ఎలా తట్టుకోవాలి." మూగగా మధన పడింది కన్నతండ్రి హృదయం.


"సాయంత్రం గంట పర్మిషన్ పెట్టి తొందగా వెళ్ళు. ఈ మహానగరంలో ఏదోమూల నీక్కావాల్సిన బ్రాండ్ పాలడబ్బా దొరక్కపోదు" అని కొం డంత ధైర్యాన్నిచ్చాడు మూర్తి తాత్కా లికంగా ఉపశమనం పొందాడు చంద్ర శేఖర్.

"నెలల పసిగుడ్డు పాలకోసం ఒక తండ్రి తహతహ లాడుతున్నాడు మరి దేశంలో - ప్రముఖులైన నాయకులు తమతమ కుమారరత్నాలు చేసిన అడ్డ మైన పనుల్నీ సమర్థించుకోవడంలో తలమునకలై ఉక్కిరిబిక్కిరవుతున్నారు. యితనిది కనీస అవసరం. అవతలి వాళ్ళది పదవి. అధికారం. రాజకీయ ప్రాబల్యం కల గలపుగా పెనవేసుకున్న స్వార్థం. తల్లీ భారతీ! యీ నీదేశం ఎటు పోతోంది?" కసిగా అనుకున్నాడు మూర్తి.

* * *

పర్మిషన్ తీసుకొని, ఆఫీసులోంచి బయటపడి రెండుగంటలు దాటి, ఎన్ని షాపులు తిరిగినా తనక్కావాల్సిన బ్రాండు పాలడబ్బా దొరక్కపోవడంతో దిగాలుపడి పోయాడు చంద్రశేఖర్.

ఒట్టి చేతుల్తో యింటికెళ్ళి సొమ్మ సిల్లి నిద్రపోయే తన ఆరునెలల కొడుకు ముఖమెలా చూడాలి? పాలడబ్బా తెస్తా నని ఎంతో నమ్మకంతో ఆశతో ఎదురు చూసే తనభార్య కేమని సమాధానం చెప్పాలి?-యిలా అనుకుంటూ అడుగులో అడుగు వేస్తూ జనరల్ స్టోర్స్, మెడి కల్ స్టోర్స్ అని బోర్డులున్న ప్రతి షాపునూ నిశితంగా గమనిస్తూ నడుస్తుం డగా-ఒక మెడికల్ స్టోర్స్ ఫ్రిజ్ మీద తనక్కావాల్సిన బ్రాండు పాలడబ్బా తళుక్కున మెరిసింది. కొండంత ఆశ నెరవేర బోతోందన్న ఆనందంతో పరు




గత్తినంత వేగంగా మెడికల్ షాప్ ముందాగాడు.

ఆయాసం తీర్చుకుంటూ – సంతోషంతో గొంతు పూడిపోగా మాటలు రాక, – "ఏం కావాలాన్సర్?" అనడిగిన బోయ్‌కి ఫ్రిజ్ మీదున్న పాలడబ్బాను చూపించాడు.

నిర్లక్ష్యంగా నవ్వాడు బోయ్. ఆ నిర్లక్ష్యాన్ని గమనించే స్థితిలో లేడు చంద్రశేఖర్. ఆ పాల డబ్బామీంచి చూపుల్ని మరల్చుకోలేదు. చేజిక్కిపోతున్న పెన్నిధిలా కనిపించ సాగింది పాలడబ్బా.

"సారీ సార్! మా దగ్గరున్న స్టాక్ అదొక్కటే. యింతకు ముందే ఒక డాక్టరుగారు ఆ డబ్బాను కొనుక్కున్నారు. ఆయనిప్పుడొచ్చి తీసుకెళ్తారు" ఏదో చెప్పుకుపోతున్నాడు ఆ షాపబ్బాయి. చంద్రశేఖర్‌కు వినిపించడంలేదు. దొరికిన పెన్నిధి చేయి జారిపోయినట్టుగా కృంగిపోయాడు.

ఉదయం నుంచీ తాను ఆ డబ్బా కోసం పడ్డ శ్రమనంతా ఏకరువు పెట్టి, ఆ డబ్బా నెలాగైనా తన కిప్పించమని బ్రతిమాలాడు.

క్యాష్ కౌంటర్లో కూర్చున్న ప్రొప్రైటర్ బోయ్‌ని తిడుతున్నాడు. "అది డాక్టర్‌గారు కొన్నారని తెలిసీ కస్టమర్స్‌కు నిపించేలా అక్కడే ఎందుకుంచావ్?" అని తిట్టిపోస్తూ– "సారీ సర్! అయిపోయాయని చెప్పాం కదా. వేరే ఎక్కడైనా ట్రై చేసుకోండి" విసుక్కుంటూ అన్నాడు.

పాలడబ్బా కోసం అడ్డమైన వాళ్ళందరి ముందూ తలొంచుకొని నిలబడాల్సి వచ్చినందుకు తనను తాను తిట్టుకోలేదు. సానుభూతి చూపించుకోలేదు. అక్కడ్నుంచి కదలనూ లేదు.

వ్యాపారంలో మునిగిపోయారు మెడికల్ షాప్ వాళ్ళు.

"ఆ డబ్బా నెలా స్వంతం చేసుకోవాలి?" అన్న ఆలోచనలో మునిగిపోయాడు చంద్రశేఖర్.

మెడికల్ షాప్ ముందాగింది ఆటో. ఠీవిగా దిగి మెడికల్‌షాప్ మెట్లెక్కుతుండగా–

"నమస్తే డాక్టర్ సాబ్! రండి రండి. ఒరేయ్! ఆ పాలడబ్బా తీసుకురా. అలాగే ఫ్రిజ్ లోంచి కూల్‌డ్రింక్ తీయ్" అని పురమాయిస్తున్నాడు ప్రొప్రైటర్.

"థాంక్యూ! నో కూల్ డ్రింక్ ప్లీజ్" అన్నాడు డాక్టర్.

"అలాగంటే ఎలా సార్! మా కోసం ప్లీజ్;" మొహమాటంలో పెట్టేశాడు ప్రొప్రైటర్.

నవ్వి ఊరుకున్నాడు డాక్టర్.

చంద్రశేఖర్ మెదడులో మెరుపులా మెరిసింది ఆలోచన. వరుగెత్తినట్టు లోపలికెళ్ళి డాక్టర్ రెండు చేతులూ పట్టుకున్నాడు డాక్టరూ, ప్రొప్రైటరూ అంతా – "ఏమిటిది?" అన్నట్టు గాభరా పడ్డారు.

"డాక్టర్‌గారూ! యివి చేతులు కాదండీ. మా వాడి ప్రాణాలు మీ చేతుల్లో పెడుతున్నాను. ఉదయంనుంచీ పాక్లేక సొమ్మసిల్లి పోయాడండి"

"పేషంటా? పదండి మీ యింటికొచ్చి చూస్తాను" అన్నాడు డాక్టర్ - తనకిలాంటి సన్నివేశాలు అతి మామూలే నన్న ధోరణిలో.

"అది కాదుసార్! మీరు తీసుకోబోతున్న ఆ పాలడబ్బాను యిప్పించండి చాలు. మీ మేలు యీ జన్మలో మరచిపోను. ఆ బ్రాండ్ తప్పించి వేరే ఏవి పట్టించినా వాడి ఆరోగ్యం పాడవుతుంది డాక్టర్‌గారూ! ప్లీజ్!" బ్రతిమాలుతూనే ఉన్నాడు.

పరిస్థితి నర్థం చేసుకున్న డాక్టర్ పెదవుల మీద చిరునవ్వు చోటు చేసుకుంది.

"యిదెక్కడి పీడరా బాబూ." గొణుక్కుంటూ గట్టిగానే అన్నాడు ప్రొప్రైటర్.

"అలాగే! ముందు నా చేతు లొదలండి" అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

"థాంక్యూసర్ థాంక్యూ. థాంక్యూ వెరీమచ్ థ్యాంక్యూ........" అంటూ డాక్టర్ చేతుల్ని కళ్ళ కద్దుకున్నాడు చంద్రశేఖర్.

"యూజీ.... యూజీ...." అంటూ భుజం తట్టాడు డాక్టర్.

"యీ బ్రాండ్ కాక మరేదో వాడితే తన కొడుక్కి వాంతులూ, విరేచనాలూ అవుతాయి. తాను డాక్టర్ గనక కొత్తదేదైనా ఎక్వైంట్ అయ్యేంత దాకా మేనేజ్ చేసుకోగలను మరి యితను...." నవ్వుకుంటూ తనలో తానే అనుకుంటూ అతనికేసి చూస్తుండి పోయాడు డాక్టర్.

పాలడబ్బా దొరికిన సంతోషంలో దాన్ని గుండెలకదుముకొని హుషారుగా తన యింటికేసి పరుగుతీశాడు చంద్రశేఖర్.